# మరపు రాని ఆ వూరు

[కథానిక]

'జమదగ్ని'

"కొండ లెక్కడ మంటే జ్ఞాపకం వచ్చింది. అదొక విచిత్రసన్నివేశం.

ఆ సంగతి తలుచుకుంటే చాలు, నా కిప్పటికీ ఒళ్లు గగుర్పొడుస్తుంది. తక్కిన జీవితంతో సంబంధం లేకపోయినా, ఒక్కొక్క సన్నివేశం, అలా హృదయానికి హత్తుకుపోయి, చివరిదాకా అనుభవస్మృతి నిస్తూనే ఉంటుందిసుమా!

ఇప్పటి మాటా? ఎన్నేళ్లయిందో అది జరిగి! అయితే ఏం, ఆ అనుభవం అల్లాటిది!

నువ్వు మదనపల్లి ఎరుగుదువా? ఎరగవూ? అదేమిటోయ్! పోనీ, దగ్గులాసుపత్రిని విన్నావా? అదా వూళ్లోనే ఉంది.

అక్కడికి పదిమైళ్లదూరంలో తెట్టని ఒక చిన్న పల్లెటూ రుందోయ్. ఆ వూళ్లో మా స్నేహితుడొక డుండేవాడు. వాడూ, నేనూ చిన్నప్పుడు ఏలూరులో చదువుకునేవాళ్లం.

అక్కడెక్కడో ఊరివాడు ఇందాకా ఎందుకు వచ్చాడనుకుంటావేమో! వాడికి పసితనంలోనే తల్లి పోయింది. అంచేత చిన్నప్పటినుంచీ అమ్మమ్మదగ్గిరే మేనమామల ఇంట్లో పెరిగేవాడు. ఆ మేనమామకు ఏలూరులో ఉద్యోగ మయింది. అందుకోసం ఇందాకా రావలసివచ్చింది.

సరేనా? వాడి పేరు రామచంద్రమూర్తి. వాడికీ నాకూ ఎంత స్నేహం ఉండేదో చెప్పడానికే వీల్లేదు. చూచినవాళ్లంతా మే మిద్దరమూ అన్నదమ్ములమనే అనుకునే వాళ్లు. అంత ఆప్యాయంగా ఉండేవాళ్ల మా రోజుల్లో!

నిజంగా ఆ రోజులే వేరోయ్! అప్పుడో రోజు అయిపోతే అయ్యో, ఎందు కయిపోయిందా అనిపించేది. ఇప్పుడలా కాదుగా! సంవత్సరాలు సంవత్సరాలు ఎల్లా దొర్లిపోతాయా అనుకుంటూ ఉంటే రోజులమాట లెక్కేమిటి! ఒక్క వ్యక్తులే కాదు, దేశం దేశమంతా ఇలాగే అనుకోవలసిన స్థితి వచ్చినట్టుంది. అవును గదూ!

సరే, దానికేం? అసలుసంగతి చెప్తా విను.

నన్ను మా రామం వాళ్లఊరు రమ్మంటూ ఉండడం, నేనేదో వీలుకాక ప్రతీసారీ వెళ్లకపోవడం, అల్లా మే మిద్దరమూ స్నేహితుల మయ్యాక మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. చివరికి మా రామానికి కోపం వచ్చే పర్యంత మయింది. 'పోనీ, రావడానికి ఇష్టం లేకపోతే రానని చెప్పేసెయ్యరాదూ?' అని కూడా అనేశాడు.

వాడికి నేనంటే అంత అభిమానం.

నన్ను వాళ్ల ఊరు తీసుకువెళ్లాలని వాడి కెంత ఉబలాటంగా ఉందో, వాళ్ల ఊరు వెళ్లాలని నాకూ అంత ఉబలాటంగానే ఉంది. అయినా అక్కడికి వెళ్లడం మాత్రం అంత తేలికగా పడింది కాదు.

దాని కనేక కారణా లున్నాయి. అప్పుడు నాకు పదహారేళ్లు. అన్నేళ్లు వచ్చినా అంతవరకూ మన వూరు విడిచి మరో వూరు వెళ్లినపాపాన పోలేదు.

ఇల్లా అన్నానని నాకు భయం వేసి మారామంఊరు వెళ్లలే దనుకోకు.

అప్పుడు మానాన్న అదోరకంగా ఉండేవారు. సెలవుల్లో నేనింటిదగ్గర లేకపోతే ఆయన కేమీ తోచేది గాదు. అందుకనే నే నెప్పుడు వెళ్తానని అడిగినా చెల్లెలి పెళ్లో, తమ్ముడి నడుగో ఏదో ఒకవంక పెట్టి వెళ్లవద్దనేవారు. నిజానికా సంవత్సరాల్లో అవీ జరిగాయనుకో! అయినా ఆయన కిష్టం ఉంటే నే నొకవారంరోజులపాటు స్నేహితునిఊరు వెళ్లిరావడం వీటికి ఏమిఅడ్డమయ్యేది?

ఆయనతత్త్వమే అంత! అడిగినప్పు డిష్టమయితే కొండమీది కోతినైనా దింపేవారు. లేకపోతే ఇవతలవాళ్లు ఏమనుకున్నా ఆయనపంతమే ఆయనది.

అదీ కాక మా నాన్న ఒప్పుకోకపోవడానికి మరో కారణం గూడా ఉన్నది. అది నా ప్రవర్తనలో ఆయనకు విశ్వాసం లేకపోవడం.

ఇప్పుడంటే ఇల్లా ఉన్నాగాని, ఆరోజుల్లో నన్ను పట్టపగ్గా లుండేవా? చిలిపితనమూ, సాహసమూ కలిపి చేసిన చిచ్చుబుడ్డిలా ఉండేవాణ్ని. ఈ ఊళ్లో కాలవ నేను లేకుండా ఒక్క క్షణం ప్రవహించేది కాదుగదా! అంతటితో సరేనా? ఊళ్లో కుఱ్ఱకారంతా నేను చెప్పినట్లు వినేవాళ్లు. రమ్మంటే రావలసిందే, పొమ్మంటే పోవలసిందే! ఇం తెందుకు? ఆంజనేయుడటూ, నే నిటూ అనుకో! లంకాదహనా లేమిటి, సముద్రలంఘనా లేమిటి, ఓ-మా చిత్తంవచ్చినట్లు చేసేవాళ్లం. అందుకనే నే నెక్కడికైనా వెళ్లితే ఏ అఘాయిత్యం చేస్తానో అని మానాన్న ఊరికే భయపడిపోయేవారు.

అయితే ఏమాట కామాట చెప్పాలి. అంత అల్లరి చేసినా నాలో ఒక సుగుణం ఉండేది. మా నాన్న కనబడితే చాలు, ఆయన ఏమీ అనకుండానే కుక్కిన పే నయిపోయేవాణ్ని.

అదీ పరిస్థితి! అల్లాంటి నేను, మా నాన్నలాంటివాణ్ని ఒప్పించి రామంఊరు వెళ్లాలి. ఇదేం ఊరికే మాటలలో అయే పనా?

అప్పు డేం చేశామో విను. ఇద్దరమూ కలిసి ఒకపెద్ద పన్నాగం పన్నాము. మారామం ఊరువాడే సుబ్బారావని ఇంకోకుఱ్ఱాడు మాతో చదువుతూ ఉండేవాడు. వాడికి మేమంటే బాగా చదివేవాళ్లమని గౌరవం ఉండేది గాని మాతో అంత చనువుగా తిరిగేవాడు కాదు. వాడి సరదా లన్నీ మరోరకంగా ఉండేవి. ఒక్కొక్క మాష్టర్ని అనుకరించి వాడు కబుర్లు చెప్పుతూఉంటే పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వు వచ్చేది. మేం వాడిదగ్గిరికి వెళ్లి ఉన్న విషయం చెప్పాము. వాడికి నిజంగానే మామీద జాలివేసింది.

అప్పుడు సుబ్బారావు 'ఒరేయి, నువ్వు రామాన్ని తీసుకుని మీవూరు వెళ్లిపో! తర్వాత ఒకటి రెండు రోజుల్లో నే నక్కడికి వస్తాను. మనపని ఎందుకు కాదో చూద్దాం' అని నాతో అన్నాడు.

సరే అంటే సరే అనుకున్నాం. నేనూ, రామం మనవూరు వచ్చేశాము.

ప్రతి యేడాదీ అంటున్నట్లు స్నేహితుడి వూరు వెళ్తాననక వాణ్నే మనవూరు తీసుకువచ్చినందుకు మానాన్న చాలా సంతోషించారు.

రామం నాతో ఇదివరకే రెండుమూడు సార్లు రావడంవల్ల వాణ్ని మాయింట్లో అంతా ఎరుగుదురు. అంచేత మేమిద్దరమూ మావాళ్లందరితో కలిసి కులాసాగా కాలక్షేపం చెయ్యడంలో తెలియకుండానే నాలుగు రోజులు గడిచి పోయాయి.

అనుకున్నట్టు సుబ్బారావింకా రాలేదు. ఇదేమిటిరా వీడు మోసం చేశాడా అని మా కనుమానం తగిలింది.

కాని ఆరోజుపోస్టులోనే రామం మేనమామ వ్రాసిన ఉత్తరం ఒకటి వచ్చింది. వాళ్లింట్లో ఉండే రామం చదువుకుంటున్నాడు గనకా, వీ డిక్కడికి రావడం ఆయనకు తెలుసును గనకా, అల్లా ఉత్తరం వ్రాయడంలో తప్పు లేదుగాని వస్తుందని మే మనుకోలేదు గాబట్టి మొదట్లో మాకు భయమే వేసింది.

మానాన్న ఆ ఉత్తరం చదువుకుని సంగతి సందర్భాలు తెలుసుకున్నారు. రామానికిగూడా చూపించమని నాచేతి కిచ్చారు.

తీరా దాన్ని చూచాక మే మిద్దరమూ మా గదిలో కూర్చుని ఎంత సంతోషించామో చెప్పతరం కాదు. నామటుకు నాకు ఈసారి నేను రామంఊరు వెళ్లడం అటు సూర్యు డిటు పొడిచినా తప్ప దని పించింది.

రామం మేనమామ వ్రాసినట్లు మూడో రోజు సాయంత్రానికల్లా రామంతండ్రి విశ్వనాథపాకయాజి గారు మావూరు వేంచేశారు.

ఆ బిళ్లగోచీ, ఆ కుండలాలూ, ఆ జారీచెంబూ-వీటితో పరమశ్రోత్రియుంగా ఉన్న ఆయన్ని చూచే సరికి మానాన్న పరవశు లయ్యారు. ప్రథమవీక్షణం లోనే వాళ్లిద్దరికీ అపరిమితమైన స్నేహం ఏర్పడింది. ఇక ఆయనమాటలు మానాన్న కమృతమే అయ్యాయి. పదిమాట లెందుకు ? ఆయన ఇక్కడ ఉన్న ఒక్క రోజూ కావలసినవన్నీ మానాన్నే స్వయంగా కనుక్కుంటూ ఒక్కక్షణంగూడా విడిచి పెట్టకుండా అంటిపెట్టుకుని ఉన్నారంటే నమ్మండి.

మారామం మాత్రం తండ్రి అంటే పరమభయ మన్నట్లు మొదట్లో ఏం పలకరించాడో ఏమో మళ్లీ ఆపూట కాయన్ని చూడలేదు.

ఆరాత్రి ఎల్లాగో గడిచిపోయింది.

మర్నాడు పొద్దున్న స్నానాలూ సంధ్యలూ అయింతర్వాత మే మిద్దరమూ సావిట్లో చాపమీద కూర్చుని కబుర్లాడుకుంటున్నాము. మానాన్నా, ఆయనా అప్పుడే వచ్చి కుర్చీల్లో కూర్చున్నారు. ఏ మవుతుందో ఏమో అని మాఇద్దరికీ మహాభయంగా ఉంది. లేచిపోదా మనిగూడా అనిపించింది కాని అదేం ప్రమాదానికి దారితీస్తుందో అని మళ్లీ అలాగే ప్రయత్న పూర్వకంగా చతికిలబడ్డాము.

'ఏరా రామం !' అన్నారు విశ్వనాథంగారు.

రామం ఆయనవంక మొహం బిగబట్టుకు చూచాడు.

అంతలో ఆయనే 'అల్లా బెంబేలుపడతావేం ? ఇల్లాంటి స్నేహితులతో సావాసం చేస్తే ఎవరుమాత్రం ఏ మంటారు ? స్నేహంకొద్దీ వచ్చావు, నాలుగురోజు లున్నావు, బాగానే వుంది. మరయితే ఎప్పుడూ నువ్వు వాళ్లింటికి వెళ్లడమేగాని అతన్నిగూడా ఒకసారి మనింటికి తీసుకురావడం అక్కర్లేదా ఏమిటి ?' అన్నారు.

నేనయినా, రామమయినా ఆయ నలా అంటుంటే ఏమనగలం! ఇంత ప్రయత్నమూ ఏదో వెకిలి మాటని పాడుచేసుకోవడం ఇష్టంలేక గుండెలు గుబుక్కు గుబుక్కు మంటుంటే అల్లాగే కూర్చున్నాము.

మళ్లీ ఆయనే మానాన్నవంక తిరిగి 'ఏమండీ శాస్త్రిగారూ ! ఏదో పసితనంకొద్దీ మావాడికి తోచ లేదు. నేను స్వయంగా అడుగుతున్నాగా, మీ వాణ్ణి మాతో పంపించండి. ఒక వారంరోజులపాటు ఉండి వస్తాడు. అబ్బాయిక్షేమంవిషయంలో నేను జాగ్రత్త పడతాను. అందునిమిత్తమై ఈషణ్మాత్రమైనా మీరు సంకోచించవద్దు. నామాట నమ్మి మీరు ఊఁ అనండి, మీవాణ్ణి మళ్లీ పువ్వుల్లోపెట్టి మీ కప్పగించేస్తాను' అన్నారు.

మానాన్న ఏమీ మాట్లాడలేదు. కాని ఆయన ముఖంలో సౌమనస్యం గోచరించింది.

'నాన్నగారు ఒప్పుకున్నట్టేనోయ్. నువ్వింక భయపడక్కరలేదు. లేచి కావలసినవన్నీ సర్దుకో. భోజన మవుతూనే బయలుదేరాలి' అంటూ విశ్వనాథం గారు తొందరపెట్టేశారు.

అంతకుముందునుంచీ అవకాశంకోసం చూస్తున్న మేమిద్దరమూ వెంటనే లేచి వెళ్లిపోయాము.

పదింటి కల్లా భోజనా లయ్యాయి.

మానాన్న నన్ను ఏకాంతంగా పిలిచి చెప్ప వలసినవన్నీ చెప్పి ఒక పాతికరూపాయ లిచ్చారు.

అప్పుడు నాకు కలిగిన సంతోషమూ, నేను పొందిన కృతజ్ఞతాభావమూ ఇంతా అంతా కాదు. అయినా ఆ సందర్భంలో అవి బయటికి రాలేక లోపల్లోపలే అణిగిపోయాయి.

విశ్వనాథంగారు బయలుదేరుతూఉంటే 'పోనీ, రేపు వెళ్లరాదా ?' అని మానాన్న అన్నారుగాని

'బాబ్బాబు! ఆ మాట మాత్రం అనకండి, సంసారంలో దిగాక ఒక్కరోజు ఇల్లు విడిచిపెట్టడ మంటే ఎంత ఇబ్బందో మీకు తెలియందికాదు. అందులో నాకు లక్షాతొంభైపనులు. ఇక్పటికే నాలుగురోజు లయింది. ఈసారి కిలా కానివ్వండి. పరిచయాలు కావాలేగాని రాకపోతామా, ఉండకపోతామా? మరయితే నావంతు ఇంతమాత్రమయినా అయింది. ఇక మీ అనుగ్రహం ఎప్పుడు కలుగుతుందో ఏమో! నాకు సెల విప్పించండి' అని అంటూనే మావంక చూసి 'ఇంకా చూస్తారేమర్రా! పదండి, రైలు వేళవుతోంది'అని విశ్వనాథం గారు మమ్మల్ని హెచ్చరించారు.

నేనూ, రామం మావాళ్లందరితో వెళ్లొస్తామని చెప్పి వీధిలో అడుగుపెట్టాము. మానాన్న అదీ ఇదీ జ్ఞాపకంచేసుకుని హెచ్చరిస్తూ ఉంటే కొంచెం మెల్లగా నడుస్తున్నాము. అంతలోనే విశ్వనాథంగారు చాలాదూరం వెళ్లిపోయారు.

తర్వాత స్టేషను చేరుకున్నా ఆయన్ను అందుకోవడం మాకు చాలా కష్టమయింది. కాని మా సుబ్బారావుమాత్రం అక్కడ మాకోసం కాచుకు కూర్చుని ఉన్నాడు.

* * *

అల్లా వెళ్లా మా వూరు.

అందుకే ఆవూరంటే నాకింత అభిమానం.

నువ్వే ఇల్లాంటి పరిస్థితుల్లో ఏదయినా ఊరు వెళ్లావనుకో! ఆ వూరు మరిచిపోగలవా?

నీకే కాదు, ఎవ్వడికీ సాధ్యం కాదు.

అవునా మరి, అల్లాంటప్పుడు ఆ వూళ్లో నేనన్నట్టే నాలుగురోజు లుండి, నాకు కలిగిన అనుభవాలలాంటివే నీకూ కలిగితే ఇంకెల్లా ఉంటుందో చూడు.

అయినా అభిమానంకొద్దీ అనుకోవడమేగాని నిజానికి మన వూళ్లల్లో అందమేముందోయ్. ఎంత దూరం చూసినా కన్ను నొప్పి పుట్టేటట్టు మాగాని చేలేగా! పంటఉన్న నాలుగు రోజులూ పైరుతో మిసమిసలాడుతూ పచ్చగా ఉన్నా ఆతర్వాత పెద్దబట్ట తలలాగా వట్టి బయలుప్రదేశమేనాయ్. పుట్టింది మొదలు చచ్చేవరకూ తినడమూ కనడమూ తప్ప మరో అనుభూతే లేని మనిషిజీవితంలాగా అంతా సమతల ప్రదేశమే అయితే అందులో ఆకర్షించేందు కేముంటుంది? ఎత్తులూ, పల్లాలూ ఉండాలి; అగాధాల్లో పడి లేచి ఆకాశాన్నంటుకోవాలి. దేశంగాని, జీవితంగాని అప్పుడే హృదయంగమ మవుతాయి. ఏమంటావ్? అవునంటావా, కాదంటావా?

నిజంగా మన కా వూళ్లు దగ్గిరయితే ఎంత బాగుంటుంది? మన నదీజలాలతో ఆ కొండలు కలిసి సౌందర్యం పరమావధి అందుకోదూ?

అనుభవించే యోగ్యత లేక, రాకపోకలు మానేసి, ఆత్మవంచన చేసుకుంటూ సౌందర్యాన్ని చూడలేకపోతున్నాం గాని నిజాని కవిమాత్రం ఏమంత దూరం?

స్నేహితునిమీది అభిమానంచేతనేమో అప్పుడు నాకా వూరు దూరమే అనిపించలేదు.

వెళ్లాను, ఆ వూళ్లో అడుగుపెట్టాను. మళ్లీ ఇంటికి రా బుద్ధివెయ్యలేదంటే నమ్ము.

రకరకాల కొండలు, అడుగడుక్కీ ఊటవాగులు. మండువేసవిలో గూడా మిసమిసలాడే పంటలు. ఎఱ్ఱని నేలా, పచ్చని చెట్లూ! చూపు పారించి చూస్తే అనంతమైన వైవిధ్యంలో ఆత్మకింపైన సామరస్యం.

ఆ ప్రాంతాలే అంత! అందులో ఆ వూరు మరీనీ!

వెళ్లిన దగ్గరనుంచీ ఒక్కక్షణంగూడా వృథా చెయ్యగూడ దనిపించింది నాకు. 'రెండు రోజులబట్టీ నిద్ర లేదు, ఇవాళ్టికి వద్దని మావాళ్లిద్దరూ మానేసినా నేమాత్రం ఊరుకోలేదు.

ఒంటరిగానే బయలుదేరి ఊళ్లోకి వచ్చిన దారే అనుసరించాను.

ఆవూరు నానుకునే చుట్టూ తిరిగి ఒక వూట వాగు పారుతోంది. అందులో అన్నికాలాల్లోనూ నీళ్లుంటాయి. అల్లాంటివే ఆ ప్రాంతాలవాళ్లకు కామధేనువుల్లా ఉపకరిస్తూంటాయి.

దానివెంబడి వెళ్దామంటే పొదలూ గట్రా ఉండి వీల్లేక నీళ్లల్లో నడుస్తూనే కొంతదూరం వెళ్లాను. అక్కడ అది రెండు పాయలుగా చీలిపోయి మధ్యన యిసకమేట వేసి ఒక లంకగా ఏర్పడింది. చుట్టూరా బిలబిలమంటూ నీళ్లు పారుతూ ఉంటే ఆనందమయి అక్కడ కాసేపు కూర్చున్నాను.

అంతలో మావాళ్లు ఏ మనుకున్నారో ఏమో నాకోసం వెతుక్కుంటూ అందాకా వచ్చారు.

అక్కడ కూర్చున్నంతసేపూ ఆ వాగు పుట్టిన చోటు దగ్గిరికి ఎల్లా వెళ్లడమా అని ఆలోచిస్తూనే ఉన్నాను. ఇదివరలో మారామం చెప్పినదాన్ని బట్టి ఆ చోటు ఊరికి మూడుమైళ్లదూరంలో ఉంది. అందాకా వాగులోనే నడవాలంటే చాలా కష్టం. వాగువెంబడే పోదామన్నా బొత్తిగా దారిలేదు. కొండలమీదుగా వెళ్లే దారేదో ఉందన్నాడు గాని అది నాకు తెలియదు.

నీళ్లు రావడంతోటే నా ఉత్సాహం అధికమై 'పోదాం, రండ్రా' అన్నాను.

'మూడుమైళ్లు వెళ్లి, మూడుమైళ్లు రావాలి. రేపు పోదాం లేవోయ్' అన్నాడు సుబ్బారావు.

'రేపు మరోచోటికి వెళ్లవచ్చు, ఆరుమైళ్లు నడిచే ఓపిక లేదా ఏమిటి?' అన్నాను నేను.

'ఇప్పుడు మూడయింది. వెళ్తే ఒక గంటసేపన్నా అక్కడ కూర్చోవాలిగదా! వచ్చేటప్పుడు చీకటి పడిపోతుందేమో' అన్నాడు రామం.

అల్లా వాళ్లు ఎంత వెనక్కి తీసినా నేను ఊరుకోక చివరికి 'మీరు రాకపోతే పోనీలెండి. నాకు దారి చూపించండి. నేను వెళ్లివస్తాను' అన్నాను.

దాంతో తప్పనిసరై వాళ్లూ బయలుదేరారు.

అదంతా కట్టె కొండలదారి. అల్లాంటి చోట నడిచే అలవాటు నాకు లేదాయె. అంచేత కొంత దూరంవరకూ, రావడానికి ఉత్సాహం లేని మా వాళ్లే ముందు నడిచారు. కాని ఆతర్వాత నాకూ అలవాటయి మావాళ్లే నాతో నడవలేకపోయారు.

అల్లా ఒక్క అరగంట నడిచాము. అంతసేపూ నేను మాత్రం నాలుగు పక్కలా చూస్తూ తన్మయున్నవుతున్నాను.

అకస్మాత్తుగా 'అదిగో బుగ్గ!' అన్నాడు మా రామం. బుగ్గ అంటే భూగర్భం నుండి జలం వచ్చే చోటు.

వాడామాట అనేవరకూ నేనటు చూడనేలేదు.

ఎదురుగా పల్లంలో ఒక పెద్ద రావిచెట్టు ఆకు లాడిస్తూ ఆహ్వానిస్తోంది.

దానికి పదిగజాల దూరంలో సన్నని యేరు బిల బిలమంటూ ప్రవహిస్తోంది.

మేము దిగుతున్న కొండ ఇటు దక్షిణానికుంటే ఆ యేరు కటువైపు ఉత్తరంగా మరొక చిన్న కొండ ఉంది. ఈ రెంటి మధ్య ఆకాశాన్నీ ఆరావిచెట్టు కొమ్మలే ఆక్రమిస్తున్నాయి.

ఆనందం పట్టలేక ఎన్నాళ్లబట్టో చూడాలను కుంటున్న తల్లికోసమన్నట్టు పరుగెత్తుకుపోయి ఆ చెట్టుమొదట చేరాను.

అక్కడ చూద్దునుకదా కొండమీదికి కనిపించిన పాయకు కొంచెం పైగా విశాలమైన సమప్రదేశంలో వందల కొలది నీటిపాయ లున్నాయి. అక్కడికి తూర్పుగా మళ్లీ అన్నీ గుట్టలే! ఆ గుట్టల్లో ఉన్నది బుగ్గ! అక్కడినుంచి నీళ్లు బయలుదేరి ఇలా పాయలు పాయలుగా వస్తున్నాయి.

ఆరావిచెట్టుక్రింద ఒక బండ ఉంటే ఆ బండ మీద కూర్చున్నాను.

అప్పటికి పొద్దు వాలి చెట్టుకొమ్మలకిందుగా నీటిపాయలమీద వెలుగు పడుతోంది.

కొన్ని పాడుతున్నాయి, కొన్ని నృత్యం చేస్తున్నాయి. కొన్ని పామునడకలు నడుస్తున్నాయి, కొన్ని కొంటెపోకడలు పోతున్నాయి. ఉన్నట్టుండి బుసబుసా పొంగేవి పొంగుతూ ఉంటే ఇదివరకునుంచీ సందడి చేస్తున్నవి ఉడిగిపోతున్నాయి. ఇవన్నీ వచ్చి వచ్చి నే కూర్చున్న బండదగ్గిరే ఏకమయి అసలు వాగుగా మురదుకు పోతున్నాయి.

సింహాసనంలాంటి ఆ బండమీద కూర్చుని ఎదురుగా చూస్తూఉంటే వరుణదేవుని సభలో కూర్చున్నట్లే ఉన్నది.

సూర్యకాంతి పడి ఆ ఛాయలన్నీ జలకన్యలలా కనిపించాయి. తళతళ మెరుస్తూ, బిలబిలమంటూ అవి పారుతూ ఉంటే నా గుండెల్లో ఆనందం జలపొడిచింది.

జలాధిదేవత ముగ్ధమోహనసౌందర్య వికాసం అంతా అక్కడే ఉంది.

సౌందర్యం, సంగీతం, కలకల నినాదం, వింత వింతసువాసనలు - ఏం లే దక్కడ? సృష్టిలో లోభనీయమైన వస్తుసముదాయమంతా అక్కడే వుంది.

అంతలో వేళయింది కాబోలు, మేతకు తిరుగుతున్న మంద నంతటినీ చేరదీయడానికి గొడ్లకాపరి కుఱ్ఱాడొకడు పిల్లంగ్రోవి ఊదసాగాడు.

ఆ సందర్భానికి ఈ మధురధ్వని తోడయి నా హృదయాన్ని తన్మయం చేసేసింది. జీవితంలో ఒక్కమాటైనా అల్లాంటి దృశ్యాన్ని చూచి ప్రకృతిరామణీయకంలో తన్మయం కాకపోతే ఇకా బ్రదుకెందుకనిపించింది!

అల్లా అక్కడ ఎంతసేపు కూర్చున్నానో ఏమో మా వాళ్ళు ఏం చేస్తున్నదీకూడా నాకు తెలియలేదు.

ప్రాపంచికవిషయాల్లో మునిగితేల్తూ ఉండే మనబోటివాళ్లకే ఇంత సంతృప్తి నిచ్చాయంటే మహర్షులిల్లాంటి చోట్లను తమ నివాసస్థలాలుగా చేసుకోవడంలో ఆశ్చర్యం ఏముంది?

సముద్రం ఉందనుకో—అదొక పెద్ద ప్రపంచ చరిత్ర. మహానదులున్నాయనుకో — అవి సుదీర్ఘ కావ్యాలు. మరి యీ సెలయేళ్లో - ఇవి ఆపాత మధుర్యాలైన గేయకావ్యాలు.

వీటి సొగసే వేరు — వీటి ఆనందమే వేరు.

మనిషయి ఉండి మనసప్పగిస్తే చాలు, ఎల్లాంటి వాణ్నయినా స్వర్గలోకవిహారం చేయిస్తాయి.

'ఇక లేవయ్యా పోదాం' అని మా రామం వేసిన కేక ఎంతో ఎత్తున తిరుగుతున్న వాణ్ని అమాంతంగా కిందికి లాగినట్లు నా మనఃప్రశాంతికి భంగం కలిగింది.

'చీకటి పడుతోంది, ఇంటికి వెళ్లాలి' అన్న విషయం అప్పటికిగాని నాకు తోచింది కాదు.

* * *

ఇక ఆ వూళ్లో ఉన్నన్నాళ్ళూ అల్లాంటి దృశ్యాలెన్ని చూశానో లెక్కలేదు. ఏ కొండమీదికే సమయంలో వెళ్లినాసరే ఏదో అద్భుతం కనిపిస్తూనే ఉంటుంది.

మనం వెళ్లాలే గాని చూడదగిన వెన్నున్నాయోయ్ అక్కడ!

నువ్వెప్పుడైనా ఎత్తిపోతలని విన్నావా? మనవైపున అల్లాంటి మాటే వినపడదు. ఎంత కమ్మని తెలుగో చూడది!

మనం జాగ్రఫీపుస్తకాల్లో చదువుతూ ఉంటామే జలపాతాలని—అవ్వన్నమాట, ఎత్తిపోతలంటే.

సూర్యోదయ సూర్యాస్తమయ సమయాల్లో అక్కడికిపోయి ఎదురుగ్గా కూర్చో — ఆనీళ్లిలా కింద పడుతూఉంటే నీమనస్సలా ఊర్ధ్వలోకాలనందుకుంటుంది. ఒక వెయ్యి సూర్యబింబాలు వెచ్చదనం విడిచిపెట్టి కనులకింపైన కాంతిప్రవాహంగా మారి నీముందు నృత్యం చేస్తాయి.

ఆ సంగతి తలుచుకుంటేనే నా కింత తన్మయత్వం కలుగుతోంది. ఇక వెళ్లినప్పుడెల్లా ఉన్నదో నువ్వే ఊహించుకో!

ఇంతకూ అసలు సంగతి చెప్పనేలేదు.

అది నే నా వూరు వెళ్లిన అయిదోరోజున జరిగింది.

ఆ వేళ మధ్యాహ్నం నేనూ, రామంగూడా సుబ్బారావింటికే భోజనానికి వెళ్ళాం. భోజనాలయ్యాక కబుర్లు చెప్పుకోవడంలో సినిమాప్రసక్తి వచ్చింది. నాకయితే దానిమీద ధ్యాస పోలేదుగాని మావాళ్ల సరదా చూచి నేనొక్కణ్నే కాదనడం ఎందుకని సరే అన్నాను ముభావంగా.

సరిగ్గా ఆట ముందు బయలుదేరడానికి సినీమా ఆ వూళ్లో ఉంటేగా? అక్కడినుంచి మదనపల్లికి పదిమైళ్లు నడిచి పోవాలి. మళ్లీ రాత్రికి తిరిగి రావడానికి వీల్లేదు. అక్కడే పడుకుని పొద్దున్నే రావాలి.

'రోజూ ఇన్ని కొండ లెక్కుతున్నాము. ఈ మాత్రం వెళ్లి రాలేమా ఏమిటి? అందులో ఎన్నడూ లేంది మంచి సినీమా వచ్చింది. శాంతారాం తీసిన రామరాజ్యంట. పోదా మంటే పోదా' మన్నారు మావాళ్లిద్దరూనూ.

నేను సరే అని పూర్తిగా ఒప్పుకున్నాక మే మిలా మదనపల్లి వెళుతున్నట్టూ, రాత్రికి రామన్నట్టూ రామం వాళ్లింటికి కబు రంపించాడు.

ఇక మా సుబ్బారావు పొద్దున్నే స్నానాలు చేసేందుకని మూడు తుండుగుడ్డలూ, ఒక సబ్బుబిళ్లా వగైరాలు సంచీలో పెట్టి దారిలో ఫలహారానికని మసి కారకుండా కుండలో వేయించిన వేరుసెనక్కాయలూ, పటికిబెల్లంలాంటి గట్టి బెల్లపచ్చు కొంతా జాగ్రత్తచేసి బయలుదేరదీశాడు.

మేం ముగ్గురమూ ఇల్లా వాకిట్లో అడుగుపెట్టాము —ఎదురుగా పెద్ద కుంకుమబొట్టుతో లక్ష్మీదేవిలాంటి సుబ్బారావు తల్లి వచ్చి 'ఇంత ఎండలో బయలుదేరారేమర్రా ముగ్గురూనూ? ఇంకా ఎక్కవలసిన కొండ లున్నాయా ఏమిటి?' అన్నది వేళాకోళంగా.

'కాదమ్మా! మదనపల్లికి పోతున్నాము. సినిమా చూసి పొద్దున్నే వస్తాము' అని ఆవిడకు సమాధానం చెప్పి 'మీరు ముందు వెళ్తూ ఉండండి. ఎందుకైనా మంచిది. నేను వెనకాలే వచ్చి కలుసుకుంటాను.' అంటూ సుబ్బారా వాగిపోయాడు.

వాడి అనుమానానికి నాకు నవ్వు వచ్చింది. ముగ్గురం బయలుదేరడం దోషమయితే ఆవిడ ఎదురు రావడం శుభమేగా! అదీకాక దోష మేమున్నా వచ్చేటట్టయితే బయలుదేరాం కాబట్టి ఎల్లాగూ వస్తుంది. ఇప్పుడు ఒక్కడు కాసే పాగడంవల్ల ముగ్గురం బయలుదేరినట్లు కాకపోయి ఆ దోష మెలా పోతుందో నా కర్థం కాలేదు.

మేమిద్దరమూ పుంతవెంబడి ఒక ఫర్లాంగు నడిచేవరకూ మా సుబ్బారావు మమ్మల్ని కలుసుకోలేదు. వాడు గూడా మాతో కలిశాక కబుర్లాడుతూ కాళ్లకు చురుకెక్కించాము.

ఆ పుంత పొలాలలోంచీ, పల్లెల్లోంచీ పోయి పోయి మూడుమైళ్ల దూరంలో ఉన్న రోడ్డుతో కలుస్తుంది. అక్కడికి మేం వెళ్లేటప్పటికి రెండున్నరగూడా అయి ఉండదు. ఎండ, వేడి లేకపోయినా, మంచి వెలుగ్గా ఉంది. ఇంకా నీడలు గూడా పొడుగు సాగడంలేదు.

అక్కడ రోడ్డునానుకునే ఒక చిన్న చెరువుంది. దానికి రెండువైపులా ఒక చక్కని రాతిగట్టూ, ఒక వైపున ఒక పెద్దకొండా! నాలుగోవైపు వరవలువచ్చే ఎత్తైన ప్రదేశం! రోడ్డు కివతల ఉన్న చిన్న చిన్న గుట్టలూ, అటుపక్క కొండా, కొంచెందూరంలో ఎత్తు మీద ఉన్న తోటలో చెట్లూ, రకరకాల పింజె మబ్బులతో ఆకాశం అన్నీ ఆ నీళ్లల్లో ప్రతిఫలిస్తున్నాయి.

'ఇక్కడ కాసేపు కూర్చుని వేరుసెనక్కాయలు తిందా' మన్నాడు మా సుబ్బారావు. ఆ సూచన నాకు చాలా సంతోషం కలిగించింది. వీళ్ళు వెళ్లిపోదా మంటారేమో ఇక్కడ కాసేపు కూర్చోడం ఎల్లాగా అని నే ననుకుంటూ ఉంటే వాడే ఆ సూచన చేశాడు.

సరే అని అక్కడ కూర్చుని నోళ్లకు పని చెప్పాము.

నాలుగైదు కాయలు తిన్నానేమో, ఆతర్వాత నేనుమాత్రం ఆ దృశ్యంవంక పారవశ్యంతో చూస్తూ ఉండిపోయాను. వాళ్లూ చూస్తున్నా వేరుసెనక్కాయలు గూడా తింటున్నారు.

అంత అందమైన చోట్లో ఉంటూగూడా ఆ అందం వాళ్ల కేమీ తెలియడంలేదు. అవును మరి, పండితరాయ లన్నట్టు అతిపరిచయం అవజ్ఞకు హేతువవుతుంది.

మన ప్రాంతాల్లో బెజవాడా, రాజమండ్రీ చూడు. అక్కడి కృష్ణలో, గోదావరిలో స్నానాలు

చేసి పవిత్రులు కావాలని యావద్భారతదేశంనుండీ ఎంతమందో వస్తూఉంటారు. ఆ వూళ్లల్లోవాళ్ళు మాత్రం వాటిని మంచినీళ్లగానైనా చూడరు. ఈ నిర్లక్ష్యం ఎందు కంటావ్? అతిపరిచయం వల్లనేగా!

అయితే మన ప్రాంతాల్లో వాళ్ళకంటే ఆ ప్రాంతాల్లోవాళ్లే అనేకవిషయాల్లో చాలా మెరుగనిపిస్తారు. వాళ్లకు సౌందర్యం చూసే తీరిక లేకపోయినా ఉన్న సంపద నుపయోగించుకునే నైపుణ్యం ఎంతైనా ఉంది. మనవాళ్ల కదీ లేదు.

నిజంగా అక్కడా చెరువు కట్టడం ఎంత తెలివితేటలో చూడు, ఎంత ఉపయోగమో ఆలోచించు. అంతగా ప్రకృతిని నమ్మి, తాము కష్టపడి, దానిచేత దాస్యంచేయించుకున్నారు కాబట్టే వాళ్ల పూర్వులు సామ్రాజ్యాలూ స్థాపించారు, దేశదేశాలూ ఆకర్షించారు. నీ వాళ్లూ, నా వాళ్లూ ఏం చేశా రయ్యా, ఒళ్లో పడ్డ ఐశ్వర్యాన్నికూడా రక్షించుకోలేక వదులుకోవడం తప్ప విడిచి?

ఎందాకా చెప్పానో జ్ఞాపకం లేదు. ఆ ప్రాంతం అంటే అభిమానంకొద్దీ ఇల్లాగే ఆవేశం వచ్చేస్తూ ఉంటుంది.

చెరునా? — సరి సరి తెలిసిందిలే!

అక్కడలా కూర్చుని ఉండగా ఆకొండ ఎక్కి కింది చెరువులో నీడ చూచుకోవా లనిపించింది.

బాగుందా? ఎల్లాంటి ఊహో చూడు.

ఆ వూహ తోచడం తడవుగా మావాళ్లతో అన్నాను. మా రాముం ఏమనసుతో ఉన్నాడో ఏమో 'అంతకంటేనా?' అని ఉత్సాహం ప్రకటించాడు. సుబ్బారావు మాత్రం 'మరిసినీమా ఎల్లాగ'' అని నసిగాడు. రామానికి కోపంవచ్చి 'నీమొహం నీమోరాను. వెధవ వేషా లెయ్యక ముందు నడు. ఇవ్వాళ్టితో ఎగిరిపోవడం లేదుగా, రేపు చూడచ్చులే'అని వాణ్ని నానా మాటలూ అన్నాడు. వాడూ చేసేది లేక మాతో కలిశాడు.

నేను ముందూ, నా వెంబడే మా రామం, వాడి వెనక మా సుబ్బారావు. ఆ వరసలో పర్వతారోహణం చేస్తున్నాము.

ఇదివర కెక్కినవాటికంటే ఈ కొండ చాలా ఎత్తైంది. పైగా మార్గమధ్యంలో ఉన్నది కాకపోబట్టి మనుష్యులు తిరిగిన దారేమీ ఏర్పడినట్టు లేదు. పసువులూ, అందులో ముఖ్యంగా మేకలూ మేతకోసం పైదాకా తిరుగుతూ ఉంటే వాటివల్ల సన్నని దార్లు ఏర్పడుతూ ఉంటాయి. అల్లాంటి దార్లు ఈ కొండ మీదా ఉన్నాయి. కాని వీటిల్లో ఒక చిక్కు ఉంది. ఇవేవీకూడా కొండపైదాకా తీసుకుపోవు. మేత ఎక్కడ ఉంటే అక్కడికల్లా పోవడంవల్ల ఏర్పడ్డవి కాబట్టి ఒకదానిలో ఒకటి కలిసిపోయి వైకుంఠ పాళీలో పాముల్లాగా కిందికీ, నిచ్చెనల్లాగ పైకీ దింపీ, ఎక్కించీ ఆడిస్తూ ఉంటాయి.

అల్లాగే శ్రమపడి అరగంటలో సగంకొండ ఎక్కేశాము.

అక్కడికి పోయాక మార్గం మునపటికంటే సులువైంది. మధ్యమధ్య కదిలిపోయిన పెద్దపెద్ద బండలు పడిఉన్నా వాటి సందుగుండా చక్కని దారి కనబడుతూ ఉంది.

ఎదురుగుండా సూర్యుడు జాజ్జ్వల్యమానంగా వెలుగుతున్నాడు.

ఆదర్శం ముందుకు పిలుస్తోంది. వెనకబడ్డ సుబ్బారావుకూడా మాతో కలిసి రాగలుగుతున్నాడు. ఇంక మా కాలోచన ఎందుకు? నిస్సంకోచంగా ముందడుగు వేస్తున్నాము.

మరో ఇరవైగజాలు వెళ్లామో లేదో అక్కడ ఒక పెద్ద చిక్కు వచ్చింది. ఇంతవరకూ మేం అనుసరించిన దారి అందాకా వచ్చి, అక్కడనుంచి రెండు వైపులా కొండ దిగిపోవడానికి వీలుగా ఉన్న అడ్డదారిలో కలిసిపోయింది. ఎక్కవలసిన వైపున ఎటు చూచినా దారిలేదు. తల ఎత్తి చూస్తే శిఖరం కనిపిస్తూ ఉంది. అక్కడికి మహా ఉంటే ఒక వందగజాలుంటుంది. ఆ కాస్తా ఎక్కగలిగితే ఆదర్శం అందుకో

వచ్చు. ఎక్కాలంటే మార్గం కనపడడంలేదు. ఏమిటి చెయ్యడం?

వెనక్కి తిరిగి చూశాం. దక్షాధ్వరంలో వీరభద్రుడి కాలితన్ను తిని పళ్లూడగొట్టుకున్న సూర్యుడు గూడా మావంక చూచి పకపకా నవ్వుతున్నాడు.

నాకూ, రామానికీ మంచి పట్టుదల కలిగింది. సుబ్బారావుకు దిగిపోదామనిపించినా రామం కోప్పడతాడేమో అని బయటికి కనకుండా ఊరుకున్నాడు.

మేమిద్దరమూ ఎక్కవలసిన వైపు చూశాము.

ఎదురుగా ఏడెనిమిదడుగుల ఎత్తున్న విశాలమైన రాతిపలక కనిపిస్తోంది. మొదట్లో దారి కనిపించని ఆందోళనలో అదే చాలా ఎత్తున్నట్లు తోచిందిగాని ఇప్పుడుమాత్రం అంతకంటే ఎత్తుండడానికి ఎంతమాత్రమూ వీల్లేదని మా లెక్కల పరిజ్ఞానం మమ్మల్ని హెచ్చరించింది. అది దాటితే ఇంకేముంది, ఆపైన చివరిదాకా చక్కని దారి, స్పష్టంగా కనిపిస్తోంది.

అంతలో 'ఒరేయి! నువ్వు దీనికి జేర్లబడి నుంచో, నేను పైకి వెళ్లిపోతాను' అన్నాడు మారామం.

వాడి కా ఉపాయం తోచినందుకు నాకు మనసులో పరమానందం అయింది.

నేను నుంచున్నాను, వాడు ఎక్కేశాడు.

శిఖరం అందుకోవాలన్న ఆదుర్దాతో 'ఒరేయ్ సుబ్బారావ్! నువ్విక్కడ నుంచో, నేగూడా పైకి వెళ్లిపోతాను' అన్నాను నేను.

వాడు వెంటనే ఒప్పుకునేవాడులాగా ముందుకు వచ్చి, ఆ రాతిపలకకు జేర్లబడి, 'నువ్వు పైకి వెళ్తావు, బాగానే ఉంది. నన్నేం చెయ్యమంటావో చెప్పి మరీ వెళ్లు' అన్నాడు.

అప్పటికిగాని ఆ ఉపాయంలో ఆ చిక్కు ఉన్నట్లు నాకు తెలియలేదు.

రామంగూడా నా మాదిరిగానే అనుకున్నాడో ఏమో మాకోసం ఉండకుండానే చకచకా పైకెళ్లిపోతున్నాడు.

'ఒరేయి రామం!' అంటూ బిగ్గరగా కేకేశాము మేమిద్దరమూ.

వాడు వినిపించుకునిగూడా 'రండోయ్! రండి' అంటూ ముందుకు పోబోయాడు.

'ఎల్లాగోయ్ రావడం? నువ్వు వెనక్కి రా' అంటూ గట్టిగా అరిచాం.

మేం ఊరికే కేకేస్తున్నామని అనుకుని ఉంటాడేగాని నిజంగా అవసర మయిందని రామానికి తోచి ఉండదు. అల్లా తోచినా తమ పబ్బం గడుపుకొని తప్పించుకుపోయేవాళ్లు లోకంలో చాలామందే ఉండవచ్చు. కాని మా రామంమాత్రం అలాంటివాడెన్నడూ కాదు. వచ్చిన చిక్కేమిటో స్పష్టంగా తెలియకపోయినా తాను వెనక్కి తిరక్క తప్పదని మా రెండోకేక వాడికి తెలియజేసింది.

వాడు వెనక్కి తిరిగాడు. 'అందాకా వచ్చాక వాడుమాత్రం ఏం చేస్తాడు?' అన్న ఆలోచన పోనే లేదు.

ఈ ఆలోచనతో వాడలా వస్తూఉంటే, నేనిలా చూస్తూ నిల్చున్నాను. మా సుబ్బారావు నిశ్చింతగా వేరుసెనక్కాయలు తింటూ అడుగునున్న వాటికోసం సంచీ అంతా వెతుకుతున్నాడు.

రామం వచ్చి 'ఎందుకూ పిల్చింది? ఇంకా రారేం?' అంటూ చిందులు తొక్కసాగాడు.

'నీ కేం నువ్వు గట్టెక్కావు. ఎక్కాంగదా అని వెళ్లిపోయావు. అంతేగాని ఇవతలివాళ్ల సంగతి పట్టించుకున్నావా? నీ ఉపాయంతో మేమిద్దరమూ పైకి రావడం ఎలాగో చెప్పవోయ్, తర్వాత ఎగురుదుగాని' అంటూ మా సుబ్బారావు వాణ్ని డబాయించాడు.

ఆ సమయంలో నా కొక ఉపాయం తోచింది.

అప్పుడే రామానికీ అసలుసంగతి తెలిసింది.

వాడు గద్దెదాకా దిగ్గి 'నా చెయ్యి చాపుతాను, అందుతుందేమో చూడం' డంటూ మావంక చూశాడు.

'నువ్వు జారిపడితే మేం చావాలి, అదిమాత్రం వద్దు బాబోయ్!' అన్నాడు సుబ్బారావు.

ఈలోగా నేను సంచీలో ఉన్న మూడు తుండుగుడ్డలూ ముడేశాను. సుబ్బారావు పుణ్యమా అంటూ అవి కొంచెం పొడుగువి కాబట్టి కలిపితే, ముళ్లు పోను, నాలుగుగజాల తాడు తేలింది. దాన్ని పైకి గిరవాటేసి రామాన్ని పట్టుకోమన్నాను. ఏదన్నా చెట్టూ గిట్టూ ఉన్నదేమో అని అటూ ఇటూ చూచాడు గాని ఏమీ కనబడక, చిట్టచివరికి తానే కూర్చుని, అంచున వీలుచూసి కాళ్లు తన్నిపట్టి, తాడు వదిలి పరే అన్నాడు.

నేను కొంచెం లఘువుమనిషిని కాబట్టి దాన్ని పట్టుకుని అల్లాగ్గా పాకిపోయాను. మొదట్లో భయమని మొండితినం చేసి 'మే మిద్దరమూ పట్టుకుంటాంరా, రారా బాబూ' అని మాచేత ధైర్యం చెప్పించుకుని, బతిమిలాడించుకుని ఎల్లాగైతేనేం చిట్టచివరికి సుబ్బారావూ పై కెక్కాడు.

వాంతో ఒక పెద్ద గండం గడిచినట్టే కాదు, స్వశక్తితో ఒక మహాసమస్యను పరిష్కరించుకున్నా మన్నంత సంతోషం పొంది, పదినిమిషాల్లో శిఖరం చేరుకున్నాము.

అక్కడ ఒక పెద్ద బండ ఉంది. మేం చేరిన చోటుదగ్గిరినుంచి చూస్తే మామూలు డాబా ఇల్లంత ఎత్తుఉంది ఆ బండ. ఆ కాస్తమాత్రం ఎక్కకుండా ఎందు కుండా లని దారికోసం దానిచుట్టూ తిరిగాం.

చిత్రం చూడు! అచ్చంగా మనుష్యులు పేర్చినట్లే ఒకదానికంటే మరొకటి కొంచెంకొంచెంగా ఎత్తైనబండలు దాని పక్కనే మెట్లలాగా అవతలివైపున ఉన్నాయి.

ఇంకేముంది? గబగబా ఎక్కేసి పైన కూర్చున్నాము.

ఇందాకా మమ్మల్ని ఉద్దేశించి నవ్వినట్లు ప్రకాశించిన సూర్యుణ్ని చూచి మేమే పగలబడి నవ్వి కసి దీర్చుకున్నాము.

అవును మరి! ఉత్సాహంకొద్దీ అంతకంతకు పైపైకి వెళ్లిపోతున్న మాతో రాలేక కాలవశాన దిగజారిపోతున్న ఆ నిరాలంబపథికుణ్ని చూస్తే మా కా వయస్సులో నవ్వు రాక జాలి కలుగుతుందా?

నవ్వినవ్వి శ్రమ తీర్చుకున్నాక మొదట్లో అనుకున్న విషయం జ్ఞాపకం వచ్చింది నాకు. అప్పుడంచుదాకా వెళ్లి కింది చెరువువంక చూచాను. నాదగ్గరకు మా వాళ్లూ వచ్చి చూచారు.

ఏటవాలుగా ఉన్న కొండ కదూ, అందుకని మనం ఎంత వెనక్కి వాలితే అంత ఎత్తుకొండ నీళ్లల్లో కనిపిస్తుంది.

అల్లా వాలి ఎంత వీలయితే అంతా చూశాము.

సూక్ష్మంగానే అనుకో, ఎక్కిన కొండా, కూర్చున్న బండా అన్నీ కనిపించాయి. కాని దూరమైపోయి మేంమాత్రం కనిపించలేదు.

ఆ కాస్త లోపమూ జరక్కపోతే నా కా క్షణం జగజ్జైత్రసంతృప్తి నిచ్చేది. అంశతో హీనమైన ఆ తృప్తి అల్లాగే ఉన్నది; కాని ఆ లోపం అప్పటి నా పసి మనస్సును ఒక్క క్షణంసేపు ఎంతెంతో కల్లోలపరిచింది.

ఇప్పుడాలోచిస్తే ఆ కల్లోలానికి హేతువు తెలుస్తోంది. ఎంత కష్టపడి ఏం సాధించినా కర్త అయిన 'నేను' మిగల్లేదే అని ఆ క్షోభ. 'నేను' కర్త కానే కాదు, అసలు కర్త జీవు డంటుంది మన వేదాంతం. ఆ వేదాంతం అర్థమయినవాళ్లు 'తాము' మిగలకపోవడమే ఆదర్శంగా భావించి ఆత్మోద్ధరణ చేసుకుంటూ లోకాన్ని ఉద్ధరిస్తారు. తెలిసీ తెలియని వాళ్లు 'తాము' మిగలడమే అసంభవమైనప్పుడు జగమంతా మిథ్యేగదా అని నేటి మన హైందవుల్లాగా ఏమీ చెయ్యకుండా ఊరుకుంటారు.

ఆ క్షణంలో నా మనసులోకి ఇల్లాంటి ఊహలేమీ రానేలేదు. అనుకున్నట్టు కాలేదన్న నిరుత్సాహంతో అవ్యక్తమైన ఆందోళనమాత్రం కలిగింది. అదైనా ఒక్క క్షణం మాత్రమే!

ఆ తర్వాత మళ్లీ ముగ్గురమూ సరదాల్లో పడిపోయాము.

'మే మిదివర కెప్పుడూ ఈ కొండ ఎక్కనే లేదురా! నువ్వు రాకపోతే శేం ఎక్కేవాళ్లమే కాదు. ఎంత బాగుంది! ఎంత బాగుంది!' అంటూ మావాళ్లు తెగ మురిసిపోయారు.

ఇకప్పుడు మే మాడిన కబుర్లు ఇన్నీ అన్నీ కావు. మావూళ్లో నాటకం, బళ్లో మేష్టర్లు, ఊళ్లో పిల్లలూ, మొన్న చూచిన బుగ్గా వీటితో ఉత్సాహం అందుకుని మాకు తెలిసిన ప్రపంచాన్నంతటినీ కబుర్లలో దింపేశాము.

ఆ ఉత్సాహంలో ఆ విశాలమైన బండమీద పడి దొర్లుతూ మేమే రాజుల మనుకున్నామంటే నమ్మ!

అయిందా? అప్పటికీ సూర్యు డింకా వెలుగుతూనే ఉన్నాడు. మా ఉన్నతస్థితిని చూడలేక కాబోలు, ఈర్ష్యాకషాయితరోచిస్సులు కక్కుతూ వెనక్కి వెనక్కి పోతున్నాడు.

అయితే ఏం? కొండకొమ్ముమీద వెలుగు బాగానే ఉంది. అప్పుడు మహా అయితే నాలు గయి ఉంటుం దని మా ఉద్దేశం. వేసవిపొద్దాయె! ఇంకా గంటసేపు కూర్చున్నా కూర్చోవచ్చు. నా ఘటుకు నాకు కదులుదామనే అనిపించలేదు.

చూపు పారినంతమేరా చూస్తూనే కూర్చున్నాను.

వేరువేరు ప్రదేశాలకు వేరువేరు రంగులు వేసి తయారుచేసిన దేశపటంలా చుట్టూ ఉన్న ప్రదేశమంతా కనిపిస్తోంది. కాలిదార్లూ, వాగులూ, రోడ్లూ అంతకంతకు వెడల్పైన గీతల్లా కనిపిస్తున్నాయి. దేన్ని చూచినా చక్కగా దిద్ది తీర్చిన ట్లున్నది. దూరాన ఊళ్లల్లో ఉన్న మట్టిమిద్దెలు కొండపల్లివాళ్ల బొమ్మల్లా ఉన్నాయ్. ఉత్తమసంస్కారవంతుణ్ని ఇతరుల్లో ఉన్న లోపాలకంటె గుణాలే ఆకర్షించి నట్లు ఆ ఎత్తుమీద ఉన్న నా కళ్లకు ఎటు చూచినా సౌందర్యమే కనిపిస్తోంది.

ఈ నేలకే ఇంత అందమా అంటే ఆ ఆకాశం మరీ అందంగా ఉంది. అదిగో అదిగో అనిపిస్తూనే ఇంకా ఇంకా దూరమైపోయిన ఆకాశం ఆ ఎత్తుమీదికి అత్యద్భుతంగా ఉంది. ఒకమూల ఏ మార్పూ లేకుండా వట్టి నీలంగా ఉంటుంది. అటు చూస్తే ఎంతో ఉదాత్తమైన గాంభీర్యం స్ఫురిస్తుంది. మరో మూల పింజెమబ్బులు ఒకదానిమీద ఒకటి పడి దొర్లుతూ రకరకాల సంచారాలు చేస్తూ ఉంటాయి. వాటివంక చూస్తే మాటలు రాని పసిపిల్లలతో ఆడుకున్నట్టే ఉంటుంది. తూర్పుకు తిరిగితే నల్ల మేఘాలు ఒత్తుగా సంచరిస్తూ ఉంటాయి. అవి కాసేపు ఓ లక్ష ఏనుగులు బారులుతీరి క్రమంగా నడుస్తున్నట్లూ, మరి కొంచెంసేపు అజానేయహయాలు కదం తొక్కుతున్నట్టూ అనిపిస్తాయి. ఇటు పశ్చిమానికి తిరిగితే నభోవలయందగ్గిర భూనభాల మిథ్యాసామరస్యం మంటతో గలిసిన పొగలు గ్రక్కుతూ ఉన్న ట్టుంటుంది.

నువ్వు చూడాలే గాని ఆకాశం చూపలేని అద్భుత మంటూ లేదు. అల్లా దానివంక చూస్తూ తన్మయులమై ఎంతసేపైనా ఉండవచ్చు. వట్టి నేలమీదినుంచి చూచినదానికంటె ఆ ఎత్తుమీదినుంచి చూడడంలో మరింత ఆనంద ముంది. ఎందుకంటే, నువ్వక్కడనుంచి నేలనూ, ఆకాశాన్నీ రెంటినీ చూడగలవు. అప్పుడు నీ కళ్లకు పరస్పరభేదసాదృశ్యాలు స్పష్టంగా గోచరిస్తాయి. అందులో ఉన్న ఆనందం మనచుట్టూ ఉన్న దేమిటో చూడలేక అందని ఆకాశంలోకి మాత్రమే చూడడంలో ఏ ముంటుంది?

అల్లా చూస్తూఉండగానే మరో అరగంట గడిచింది.

మా రామం ఈలపాట పాడుతున్నాడు. సుబ్బారావు దానికి తాళం వేస్తున్నాడు.

నేను వాళ్లవంక చూసేసరికి ఇద్దరూ ఒక్కసారే 'ఇక దిగుదామా?' అన్నారు.

సరే అంటే సరే అని ముగ్గురమూ ఆ బండ దిగి 'అదెంత బాగుందిరా' అంటే, 'ఇదెంత బాగుందిరా' అనుకుంటూ కొంతదూరం ఉత్సాహంగానే నడిచాము.

కాని మేము ఎత్తుమీద ఉన్నంతసేపూ బాగానే కనిపించిన సూర్యుడు దిగినకొద్దీ కనిపించడం మానేశాడు.

దాంతో ముగ్గురం ముగ్గురమే—గుండెల్లో అధైర్యపడిపోయాము.

మే మున్నచోట అప్పటికే మసకచీకటిగా ఉన్నది. దిగలేకపోతా మేమో అన్న భయంతో స్పష్టంగా కనిపించకపోయినా వచ్చినదారివెంబడే తడుముకుంటూ చకచకా దిగుతున్నాము.

అల్లాగే వెళ్లివెళ్లి ఇందాకా ఎక్కేటప్పుడు కష్టంవేసిన చోటుదగ్గిరికి వచ్చేటప్పటికి ఒకరి కొకరం కనిపించడమే కష్ట మయింది.

వెనక్కి తిరిగి చూద్దుంకదా మేం కూర్చున్న బండమీదమాత్రం ఇంకా వెల్తురుగానే ఉంది.

కడచింది జ్యోతిష్మంతం—ముం దున్నది అగమ్యమైన అంధకారం! ఏమిటి చెయ్యడం?

మా ముగ్గురికీ భయంగానే ఉంది. ఎల్లాగైనా దిగిపోవా లని ఆదుర్దాగానే ఉన్నది.

ముచ్చెమటలు పోస్తున్న శరీరాలతో ముగ్గురమూ మూడువైపులా చూచాము.

ఎటు చూచినా ఏం ప్రయోజనం? నిమిషం గడచినకొద్దీ పెరిగే అంధకారంగాని తగ్గేది కాదాయె. కొంతదూరం సాగనిచ్చినట్లే సాగి అక్కడితో ఆగిపోయి అగాధంగా కనిపించడం, దాంతో వెనక్కి రావడం. తక్కినవాళ్ళు కనబడరేమో అని ప్రతివాడికీ భయమే! చుట్టూరా నీళ్లు పోస్తే మధ్యనున్న చీమలు అంచుదాకా పోయి, దాటలేక వెనక్కి తిరిగి, దారికోసం తహతహలాడేటట్టు ధైర్యంకోసం ఒకరినొకరం పిల్చుకుంటూ మేం ముగ్గురమూకూడా ఆందోళనతో ఆ పరిమితిలోనే తిరిగితిరిగి వేసారిపోయాము.

అప్పుడు నాకు మరో భయం కలిగింది. దిగివెళ్లే దారి కనుక్కోవడం మాలో ఎవ్వరితరమూ కాదు. అది ముమ్మాటికీ నిశ్చయం. ఆ సంగతి తెలిసీకూడా ఇంకా కాసేపు అలాగే వృథా చేశామా పైకి వెళ్లే దారిగూడా కనబడకుండా పోతుంది. ఏ మూల ఏం ఉంటుందో తెలియక రాళ్లతో రప్పలతో ఎగుడుదిగుడుగా ఉన్న అక్కడ ఉండిపోవడంకంటె పైకి వెళ్లి ఆ బండ చేరుకోవడం మంచిది కాదూ!

ఈ సంగతే మావాళ్లతో అన్నాను.

రాత్రంతా ఇక్కడే ఉండాల్సి వచ్చిం దన్న జ్ఞానం కలగక వాళ్లింకా దిగగలమన్న మాయలోనే ఉన్నారు.

'మీఇష్టం. చేతనైతే ప్రయత్నించం' డని నేను మాత్రం వాళ్లకు త్వరగా జ్ఞానోదయం కలగాలని భగవత్ప్రార్థన చేస్తూ అక్కడే ఒక బండ నానుకుని నుంచున్నాను.

అయిదునిమిషా లైంది, పదినిమిషా లైంది.

ఇద్దరూ దిగులుపడ్డ ముఖాలతో నా దగ్గరకు వచ్చారు.

ఇంకాలస్యం చేస్తే లాభం లేదని నేను ముందు దారి తీశాను. వాళ్లూ నావెంబడే వచ్చారు.

అప్పటికి పైనగూడా చీకటి కమ్మేస్తోంది.

ఆచీకట్లో దారి కనుక్కోవడం కష్టమే అయింది. అయినా ఆదర్శం ఎదురుగా కనిపిస్తూ ఉండబట్టి ఇది కాదని అదీ, అది కాదని ఇదీ ప్రతి వైఫల్యంతోనూ మార్చుకుంటూ వేరువేరు మార్గాల ననుసరించి చివరి కెల్లాగో పైదాకా వెళ్లగలిగాము.

ఆ మెట్లెక్కి పైబండ చేరుకున్నాకగాని నా గుండె కుదుటపడలేదు.

దానిమీద చతికిలబడి 'అమ్మయ్య' అనుకున్నాను.

భగవంతుడి దయవల్ల ఆ బండ ఒక చిన్న గదంత విశాలంగా ఉంది. అదే అక్కడ లేకపోతే ఏమైపోయేవాళ్లమో అని ఇప్పటికీ అనిపిస్తుంది.

మావాళ్లుగూడా పైకి వచ్చారు గాని వాళ్లకాందోళన తగ్గలేదు. నామాదిరి చతికిలబడక ఆ బండమీదే భయంభయంగా అటూ ఇటూ తిరుగుతూ ఎక్కడైనా దిగడానికి వీలుందేమో అని మహాజాగ్రత్తగా చూడటం మొదలుపెట్టారు.

ఆదుర్దా అట్లా చేయిస్తుందిగాని నిజాని కక్కడ నుంచి దా రెక్కడుంటుంది ?

'ఎందుకురా వృథా ప్రయాస? నామాట విని కూర్చోండి' అన్నాను నేను.

మా సుబ్బారావు కేడుపు వచ్చేసింది.

రామానికి నన్ను మింగెయ్యా లన్నంత కోపం వచ్చింది.

నామూలాన్నే ఇంతపనీ అయిందని వాడి ఉద్దేశం. ఆ స్థితిలో వాడి కట్లా అనిపించింది గాని, నిజానికి నే నేం చేశాను? నాధోరణిలో నే నుండిపోయి వాళ్లు పోదా మనేదాకా బయలుదేరలేదు. ఇంకా పెంద రాడే వెళ్దామని వాళ్లు అనిఉండి నేను రా నన్నట్టయి తేగా నామీద నేరం మోపాలిసింది! కాకపోతే నా అంతట నేనే బయలుదేరదా మని అనాలిసింది. అలా నే ననలేదు. అదీ నా తప్పు.

రామం ఎన్ని అన్నా నేను ఊఁ ఆఁ అనకుండా ఊరుకున్నాను. కాసేపటికి విసుగుపుట్టి వాడిమటుకు వాడూ ఊరుకున్నాడు.

'ఉత్సాహంకొద్దీ వచ్చాము. ముందే జాగ్రత్త పడక ఇబ్బందిలో పడ్డాము. నిజమే! ఇందుకోసం ఏడ్చి ఏం లాభంరా అబ్బాయి!' అంటూ నేను మహా పెద్దవా ణ్నయినట్టు మా సుబ్బారావు నోదార్చాను.

'ఈరాత్రంతా ఇక్కడ పడిఉండడం ఎల్లారా? ఏం మెకా లొస్తాయో ఏమో! నా కేమీ తోచడం లేదురా' అంటూ వాడు గుమ్మటిల్లిపోయాడు.

ఆముక్క వినేటప్పటికి నాకూ వణుకు పుట్టింది. పైకి నిబ్బరంగా ఉన్నానన్న మాటేగాని అంతకు ముందుమాత్రం లోపల భయం లేదనా? అది దీంతో మరీ ఎక్కువైంది.

ప్రవరాఖ్యు డన్నట్టు మిన్నులువడ్డచోట పడితి మాయ్! ఆయనకు మాదిరి ఏ అప్సరసో కనిపించి ఊరుకోక మాకు మేమే తోడయితిమాయ్! ఎంత భయంర వేస్తేమాత్రం ఏమిటి చేసేది?

అప్రయత్నంగా నాకళ్లు తమంతట తామే మూసుకున్నాయి. మనసు తోచిన ధ్యానశ్లోకాల నన్నిటినీ చదవడం మొదలుపెట్టింది.

ఆ శ్లోకాల మాట లయితే కదులుతున్నాయి గాని లోపల మెదులుతున్న రూపాలన్నీ భయంకర వన్యమృగాలవే!

మేం కొండ లెక్కుతున్నామని తెలియడం తోటే ఊళ్లో ప్రతివాడూ మమ్మల్ని హెచ్చరించాడు. అడివిలో తిరిగేవాళ్లుకూడా వెలుగుండగానే వచ్చేస్తారట. చీకటిపడిం దంటే ఎలుగ్గొడ్లూ, ఏగోలాలూ కొండలమీద చిత్తం వచ్చినట్లు తిరుగుతాయట! అప్పు డప్పుడవి ఊళ్లోకి గూడా వచ్చి మేకల్నీ, దూడల్నీ గుంజుకుపోతూ ఉంటాయట!

ఇవన్నీ అప్పుడు జ్ఞాపకం వచ్చి కన్నుమూసుకునే ఉన్నా అవితప్ప మరొకటి కనిపించలేదు.

నే నలా అణువణువునా వణికిపోతూ కళ్లు మూసుకునే ఉన్నాను. ఆ స్థితిలో నా పొట్టమీదికి జుట్టులాంటి దేదో వచ్చి తగిలింది.

'అమ్మ బాబోయ్ ఎలుగ్గొడ్డు!' అంటూ అరిచేశాను. 'ఆఁ ఆఁ' అంటూ మావాళ్లు గూడా ఉలిక్కిపడి లేచి, నాలుగడుగులు వేసి, అంత భయంలోనూ తా మున్నది కొండచివరి బండమీ దని జ్ఞాపకం వచ్చి, చటుక్కున కూలబడి, కళ్లు మూసుకుని గొల్లు మన్నారు.

కాసే పున్నాక ఇందాకటి స్పర్శ లేనట్లయి నెమ్మదిగా కళ్లు తెరిచాను. భయంభయంగానే నాలుగు పక్కలా చూచాను. ఎక్కడా ఏమీ లేదు. మోకాళ్ల మధ్య తలలు పెట్టుకుని మావా ళ్లిద్దరూ మాత్రం రెండు పేడముద్దల్లా కూర్చున్నారు.

'ఏమిటో అల్లా అనిపించిందిగాని ఏమీ లేదురా' అన్నాను బిగ్గరగా!

'సరిగ్గా చూడరా బాబూ, ఏమూల దాక్కుందో' అంటూ మాసుబ్బారావు భయంలోనే గోల పెట్టాడు. 'ఏదీ? ఎక్కడా లేదే!' అని నే నంటూ

ఉండగా రామం కళ్లు మూసుకునే నెమ్మదిగా జరిగి వచ్చి నాఒళ్లో తలపెట్టి పడుకున్నాడు. సుబ్బారావూ జరిగివచ్చాడు. ముగ్గురమూ అలాగే ఒకరిమీద ఒకరం వాలి కొంచెంసేపు కూర్చున్నాము. మా రామం తల నా పొట్టకు తగులుతోంది. సుబ్బారావు నా మెడమీద తన ముఖం పెట్టి చేతుల్తో మమ్మల్నిద్దర్నీ చుట్టేస్తున్నాడు.

రామంశిరస్పర్శ ననుభవించాక ఇందాక ఎలుగ్గొడ్డనుకోవడం వట్టి భ్రాం తనిపించింది. నేను కళ్లు మూసుకుని ఉండగా వాడు భయంకొద్దీ వంచిన తలతో నాదగ్గరకు జరిగాడు కాబోలు, ఆ జుట్టు తగిలి ఎలుగ్గొడ్డే అనుకుని భయపడిఉంటాను. అంతేగాని ఆ బండమీది కవేం వస్తాయి?

అల్లా తోచడంతోటే ఆ ముక్క నిజ మనిపించుకోవా లని 'ఏరా రామం' అంటూ ఏమో అనబోయాను. దానికే వాడు ఉలిక్కిపడిపోయాడు. భయం లేదురా అని వీపుమీద తట్టుతూనే నా సందేహం బయట పెట్టాను. 'బాబోయ్! ఆమాట ఎత్తబోకు' అంటూ మొదట్లో ముడుచుకుపోయాడుగాని తర్వాత నెమ్మదిగా జ్ఞాపకంచేసుకుని 'నిజమేరా' అంటూ నా ఒళ్లోనుంచి కదిలాడు.

అప్పటికి ఆ లుంగజుట్టుకోవడం అందరికీ కష్ట మయింది. ఇందాకటి భయహేతువు వట్టిభ్రాంతని నిర్ధారణ కావడం కొంత ధైర్యం ఇచ్చింది. దాంతో ఒకళ్లొకళ్లమే కొంచెంకొంచెం గాసడలి, విడివడిపోయి, ఒక్క ముద్దలాగా ఉన్న వాళ్లమల్లా ముగ్గురమూ మూడు మూర్తుల మయ్యాము.

అయ్యామే కాని భయం తగ్గిందా? అంతా గాఢాంధకారం! మా ఉచ్ఛ్వాసనిశ్వాసాలు కూడా వినిపించేటంత నిశ్శబ్దం.

ఆ చీకట్లో దూరంగా ఉన్న చిన్నచిన్న బండ లన్నీ మాకోసమే పొంచి చూస్తున్న వన్యమృగాల లాగా కనిపించాయి. కదిలిన ప్రతినీడా ఏ జంతువో వస్తోం దన్న భ్రాంతినే కలిపించింది.

నిశ్శబ్దంగా ఉండిఉండి ఏగాలికో ఎండాకులు గలగలలాడడం, దాంతో మా గుండెలు దడదడలాడడం, దూరాన ఏ బండనో అంటుకుని రెండు మిణుగురుపురుగులు మిలమిలలాడడం, అవి మా కళ్లకు ఏ చిరుతపులి కళ్లలాగానో కనిపించడం!

అల్లా ఉన్నకొద్దీ భయం ఎక్కువైందేగాని ఎంతమాత్రమూ తగ్గలేదు.

అకస్మాత్తుగా నా కెందుకో రామభజన చెయ్యా లనిపించింది. వెంటనేచప్పట్లు కొడ్తూ మొదలు పెట్టాను. మావాళ్లూ నాతో కలిశారు. అల్లా కాసేపు కాలక్షేపం చేసేటప్పటికి దైవమహిమవల్ల కాక పోయినా అన్యకార్యనిమగ్నతవల్ల మా మనస్సులు ఉన్న పరిస్థితిని విస్మరించి తాత్కాలికంగా భయాన్ని కోల్పోయాయి.

అందాకా ఎక్కడ దాక్కుందో ఏమో అప్పుడు మా కెక్కడలేని ఆకలీ వేసింది. నాలుగైదురోజు లన్నం మానేసినా అల్లాంటి ఆకలి వేసిఉండదు.

ఆదుర్దాకొద్దీ సుబ్బారావు తెచ్చిన సంచీ వెతికాము. అందులో వేరుసెనక్కాయలు దారిలోనే అయిపోయాయి. బెల్లపచ్చుసంగతి 'నాకు తెలియ' దంటే 'నాకు తెలియ' దని వాళ్లిద్దరూ అన్నారు. ఎక్కడ పడిపోయిందో ఏమో సంచీలో కనపడలేదు.

ఆకలిమాత్రం ఏమీ తినని నా కెలా ఉన్నదో, అంతో ఇంతో తిన్న వాళ్లకూ అలాగే వుంది.

ఆకలిదారిన ఆకలిలా ఏడుస్తూనే ఉంది. ఇంతలో ఆయనచెల్లెలు దాహంకూడా వచ్చి గోలపెట్ట సాగింది.

ఎవ రెంత ఏడిస్తేమాత్రం ఆ స్థితిలో ఉన్న మే మేం చెయ్యగలం? ఉన్నది ఊరు కాదాయ్! అందరికీ మౌనమే సమాధానంగా అలా కూర్చుండి పోయాం!

ఆకలి నణచడానికి మడతరొట్టెలూ, దాహం తీర్చడానికి చప్పరింపులూ - అవే మాకు గతి అయ్యాయి.

పోనీ అలా ఉండిపోయినా త్వరగా తెల్లారుతుందా అంటే అదీ లేదు.

గంట ఎంతయిందో తెలియదు!

మౌనంగా కూర్చుంటే భయం!

మాట్లాడితే ఆకలి!

ఇంట్లో ఉన్నప్పుడు ఊరికే వచ్చే నిద్ర ఆ సమయంలో ఎంత బతిమాలినా రానేలేదు. శరీరాలు వాల్చడమే కాని దొర్లి ఎక్కడ పడిపోతామో అని భయమేనాయ్!

అప్పటికీ కొంత అదృష్టవంతులం కాబట్టి ఆ చిక్కు వేసవికాలంలో వచ్చింది. అదే ఏ శీతాకాలంలోనో అయితే మా బతుకులు నిజంగా బండలపాలయ్యేవి.

త్వరగా తెల్లవార్చమని తెలిసిన దేవతల కందరికీ మొక్కులుమొక్కుకుంటూ అల్లాగే నడుములు వాల్చాము.

ఆకాశంలో నక్షత్రాల కాంతీ, నల్లని ఆ బండమీద మా వంటి సన్న దుస్తుల తెలుపూ, అక్కడక్కడ మినుక్కు మినుక్కుమనే మిణుగురు పురుగుల మెరుగూ తప్ప, అంతా అంధకారమే! పొదల్లో ఎక్కడెక్కడో ఒకటొకటిగా ఉన్న కీచురాళ్ల ధ్వనీ, ఆ ఎత్తుమీదికి వేగంగా దూసుకువస్తున్న గాలి మా చెవులదగ్గర వినిపించిన బుసబుసా తప్ప అంతా నిశ్శబ్దమే!

ఆ అంధకారాన్నే చూస్తూ, ఆ నిశ్శబ్దాన్నే వింటూ క్రమక్రమంగా కొంతసేపటికి వాటికి అలవాటు పడిపోయాము.

మధ్యాహ్నంనుంచీ ఒకేవిధంగా తిరగడంలో అలిసిపోయిన మా శరీరాలు మాకు తెలియకుండానే నిద్రలో మునిగిపోయాయి.

ఆ వేసవికాలంలో కొంపల్లో ఉంటే ఎన్నడూ ఎరగని చల్లని గాలి అక్కడికి వచ్చి మమ్మల్ని హాయిగా జోకొట్టింది.

భయమూ, ఆకలీ, దప్పికా—ఏ మయ్యాయో వాటిదారి నవి మాయమయ్యాయి.

తెల్లవారేవరకూ ఒళ్లు తెలియకుండా నిద్రపోయాము. మేలుకున్నంతసేపూ ఏవేవో ఊహించుకుని భయపడ్డామే కాని ఆ రాత్రి, ఎన్నడూ మనిషిని చూడని ఆ ప్రదేశంలో, నిజాని కొక్క చీమైనా మా కపకారం చేసిన పాపాన పోలేదు.

మెలకువ వచ్చింది. నిజంగా ఉన్నామో లేమో అని ఒకరినొకరం చూచుకున్నాము. మా సంగతి మాకే ఆశ్చర్యం కలిగించింది!

ఎదురుగా ఉదయభానుడు మావంక చూస్తూ అనురాగంతో చిరునవ్వు నవ్వుతున్నాడు. ఎన్నెన్నో పక్షులు కిలకిలమంటూ ఆయన్ని ప్రశంసిస్తున్నాయి!

ఆ ఎత్తుమీద కూర్చుని క్రమంగా పైకి వస్తున్న సూర్యుణ్ని చూస్తూంటే కడచిన రాత్రి సంక్షోభమంతా అదృశ్యమయి మా మనస్సులు నూత్న చైతన్యాన్ని పొందాయి.

ఉదయసంధ్యారాగం అల్లాగే ఉన్నది. కాని సూర్యుకు సంపూర్ణబింబాకృతి ధరించాడు. అంత పెద్దబింబాన్ని ఇంకెప్పుడూ చూడలేదు మేము. అందులో ఎంత తేజస్సు, ఎంత సౌమ్యత! నేలమీది నుంచి చూస్తే ఇట్టే అయిపోయే ఆ పుణ్యసమయం అక్కడ ఒక అరగంట సేపున్నట్టుంది.

అప్రయత్నంగానే 'నమస్తే కర్మసాక్షీ' అనుకున్నాయి మా మనస్సులు.

* * *

ఆ రాత్రి, ఆ కొండమీద, అల్లా గడిపిన వాళ్లం ప్రభాతసూర్యుడికి ప్రత్యుత్థానం చేసి, నిన్న సాయంత్రం మాయమయి అంతచిక్కు పెట్టిన దారి స్పష్టంగా కనిపిస్తూఉంటే, రాత్రి పొందిన అనుభవాన్ని గూర్చి, మా సంగతంతా విని ఎవరెవ రేమే మనుకుంటారో వాటినిగూర్చి కబుర్లాడుకుంటూ చకచకా కొండ దిగి పోయాము.

దారిలో మొహాలు కడుక్కునీ, తుందుగుడ్డలున్నాయి కదా అని వాగులో స్నానాలు చేసీ, ఎంత ఆలస్యం చేసినా ఊరుచేరుకోడానికి మా కప్పుడు ఒక్క గంటసేపుగూడా పట్టలేదు.

ఊళ్లో అడుగుపెట్టాము.

మొదట్లో మా రామం తండ్రే కనిపించాడు.

'అర్ధరాత్రే బయలుదేరారా ఏమిట్రా? పెందరాడే వస్తున్నారు' అన్నాడాయన.

మే మేమీ సమాధానం చెప్పక ఔ నన్నట్టు తల లూపి ఇళ్లకు వెళ్లిపోయాము.

తర్వాత రాత్రి జరిగిన సంగతంతా చెప్పాము. ఎంత చెప్పినా ఆయన నమ్మనేలేదు. సినీమాకి వెళ్లి వచ్చే తమాషా కీ కబు ర్లన్నీ చెపుతున్నామని ఆయన ఉద్దేశం.

ఆయ నే గాదు. ఊళ్లో విన్నవాళ్లంతా అల్లాగే అనుకున్నారు.

'కొండమీద రాత్రి ఉండిపోవడ మేమిటి? బతికి రావడ మేమిటి?' అని గూడా కొందరు డబాయించారు.

వాళ్ల కర్మం వాళ్ల దని మే మేమీ సమాధానం చెప్పకుండా ఊరుకున్నాం.

మా మాటల్లో నమ్మకం లేకపోయినా మా నోటితో వినడానికి మాత్రం ఊళ్లోవాళ్లంతా ఆ మధ్యాహ్నందాకా వస్తూనే ఉన్నారు. ఆనాడు మా రామం ఇల్లు నిజంగా నే ఒక తీర్థ మయిపోయింది.

మధ్యాహ్నం రెండుగంటలవేళ అల్లా వచ్చిన వాళ్లల్లో మా నాన్నే ప్రత్యక్ష మయ్యారు.

దాంతో నా పై ప్రాణాలు పైనే ఎగిరి పోయాయి.

మావూళ్లోనుంచి బయలుదేరాక రైల్లో ప్రయాణంచేస్తూ ఈ ఊళ్లో ఒక్కవిషయంలో తప్పకుండా జాగ్రత్తపడా లనుకున్నాను. కాని ఇక్కడి సరదాల్లో ఆ సంగతే మరిచిపోయాను.

ఈ ఊరు రావడంతోటే విశ్వనాథంగారు వ్రాసి నట్టు మా సుబ్బారావుచేత ఉత్తరం వ్రాయించాల్సింది. ఆ పని నేను చెయ్యలేదు; మా నాన్న నన్ను వెతుక్కుంటూ వచ్చేశారు.

ఇం కేముంది? అక్కడ నాటక మాడామని తెలియడం, ఇక్కడ రాత్రి జరిగిన సంగతి వినడం— ఆయన్ని మహోగ్రుణ్ని చేసేశాయి.

నలుగురిలోనూ ఎంత నగుబాటు చెయ్యాలో అంతా చేసి, నానామాటలూ అని, ఘోరాతిఘోరాలు చేసిన దుష్టుణ్ని పట్టుకున్నట్టు మా నాన్న నన్ను ఆ పూటే వెంట పెట్టుకుని తీసుకుపోయారు.

చిరుచేదు కలిస్తే నేం? తేనె ఎప్పుడైనా మధురం కాకపోతుందా? అందుకనే మరింత ఆస్వాద్య మవుతుందేమో!"